


సచ్చిదానంద సద్గురు

# సాయివాణి

ధార్మిక, సామాజిక మాస పత్రిక

(సాయి సేవా సమితి ప్రచురణ)

సంపుటి : 21 జూన్, 2024 సంచిక : 1



**సంస్థాపకులు :**
**శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీవారు**
**సంస్థాపక సంపాదకత్వం :**
**శ్రీ మాతా శుకవాణి**
**ప్రధాన సంపాదకత్వం :**
**శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీ**
**ప్రత్యేక సహకారం :**
**డా॥ జి.చంద్రారెడ్డి** M.A, M.Ed., Ph.D
**శ్రీ వి.వి. కృష్ణారావు (సాయిశ్రీ ప్రింటర్స్)**
**శ్రీమతి పి.వి. ధనలక్ష్మి (డి.టి.పి)**
**ప్రచార సారథ్యం :**
**శ్రీ బి. గోపీకృష్ణ**
**శ్రీమతి బులుసు జయ**



**సాయివాణి చందా వివరాలు**

2 సంవత్సరాలకు చందా.........రూ॥200/-
10 సం.రాలకు చందా........ రూ॥1000/-



**చిరునామా :-**

**సాయివాణి**

**సాయిధామం, బొమ్మల రామవరం మండలం,**
**యాదాద్రి భువనగిరి జిల్లా-508 126.**
**Ph : 9440413455, 9848133565**



**Online Donations :**
**SRI SAI SEVA SAMITHI TRUST**
**A/c No.62002652136**
**SBI Keesara Branch,**
**IFSC Code : SBIN 0020639**


**విషయసూచిక పుట సంఖ్య**


మా వాణి ........................ 2
గురు పూర్ణిమోత్సవం ........................ 5
స్వయంకల్పిత బంధం ........................ 7
జ్ఞానోదయమే జీవనసాఫల్యము 14
సాయిభక్త దాసగణు ........................ 17
శాశ్వత ధర్మగోప్త ........................ 20
శ్రీ సాయి నిత్య పారాయణ .......... 23
ఊదీతో వంటకాలు ........................ 25
మాతృసంస్థ కబుర్లు ........................ 28
సాయిధామ సేవాశ్రమంలో .......... 29
నేటి మాట: ధనము, దానము ... 31



(ఈ పత్రికలోని రచయితల అభిప్రాయాలు వారి వ్యక్తిగతమైనవి. పత్రిక యాజమాన్యానికి బాధ్యత లేదు.)







# మా వాణి



శ్రీ సాయినాథుల వారు షిరిడీకి వచ్చిన క్రొత్తలో ఉత్తి ఫకీరులాగా కన్పించేవారు. జనం కూడా అలాగే భావించేవారు. కొద్దికాలం తరువాత వనమూలికలు, ఆకులు, వేళ్లతో వైద్యం చేయసాగారు. హస్తవాసి గల వైద్యుడన్న పేరు సంపాదించుకున్నారు. అటుపైన కొంతకాలానికి సాయి బాబా ధుని ప్రతిష్ఠ చేసారు. తరువాత ధునిలోని విభూతే (ఊదీ) మందుగా యిచ్చేవారు. గృహబాధలకు, ఆధులకు (మానసిక), వ్యాధులకు- అన్నిటికీ అదే తరణోపాయంగా పనిచేసింది. పోయిన ప్రాణాలు తిరిగి రప్పించగల శక్తి కూడా సాయి చేతి ఊదీకున్నదని సచ్చరిత్రలో ఋజువు లున్నాయి. అయితే -

సర్వవ్యాపకుడూ, సర్వశక్తిమంతుడూ అయిన స్వామికి మూలికలో, విభూతో, యింకోటో అవసరమా? అవసరం లేదనీ - అవి ఏదో ప్రజలలో విశ్వాసాన్ని కలిగించడానికో, లేక తమ పరోక్షంలో వారికి ఉపయోగపడ టానికో సాధనాలుగా చూపించారే తప్ప అవి వారికి సాధనాలు కావనీ, ఆయన కేవలం ఒక్క మాటతోనే భక్తుల యిక్కట్లు తీర్చగలరనీ ఎన్నోసార్లు ఋజువైంది. శ్రీ సాయి నామమే మంత్రమని యిప్పుడు మనం భావిస్తు న్నాము. ఆ రోజులలో సాయి మాటే మంత్రంగా పనిచేసేదన్నమాట.

ఒకరోజు శ్యామాను పాము కాటు వేసింది. ఆ రోజుల్లో అందరికీ అలవాటుగా ఉన్న మంత్రగాడి దగ్గరకు వెళ్లకుండా, శ్యామా తనకు దైవమైన బాబా దగ్గరకే వచ్చాడు. కానీ బాబా అతనిని మసీదుపైకి కూడా రానివ్వలేదు. పైగా “పైకి రావద్దు వచ్చావంటే ఏమవుతుందో చూడు” అని బెదిరించారు. “ఫో, వెళ్లిపో” అని కసరడంతో ఏమీ తోచని శ్యామా ఇక తనకు మరణమే గతి అనుకున్నాడు. కానీ కొంతసేపటికి బాబా అతనితో “ఏ మాత్రం విచారించకు. దయామయుడైన ఫకీరు నిన్ను

రక్షిస్తాడు. ఇంటికి వెళ్ళి ప్రశాంతంగా కూర్చో" అన్నారు. అలాగే కొద్ది గంటల్లో శ్యామా తేరుకున్నాడు. బాబా "కిందకు దిగిపో పైకి ఎక్కవద్దు" అని శాసించింది తనను కాదనీ తనలో ఉన్న పాము విషాన్ని అనీ శ్యామాకు అప్పుడు అర్థమైంది.

దామూ అన్నాకు రెండు వివాహాలు అయినా సంతానం కలుగలేదు. ఆయన జాతకంలోనే సంతానయోగం లేదని జ్యోతిష్కులు చెప్పారు. అయినాగానీ బాబా మీద విశ్వాసంతో దాము అన్నా షిరిడీ వచ్చి కొంతకాలం అక్కడ ఉండిపోయాడు. చివరికి ఒకనాడు బాబా అతనికి నాలుగు మంచి మామిడిపండ్లు ఇచ్చి, "ఈ ఆమ్ర లీల వలన నలుగురు కుమారులు, నలుగురు కుమార్తెలు పుడతారు పొమ్మన్నారు. బాబా మాట జాతకబలాన్ని మార్చివేసింది. ఆయన చెప్పినట్లే దామూకు ఎనిమిదిమంది పిల్లలు కలిగారు. సపత్నేకర్ అనే అతను తన తెలివితక్కువతనం వలన బాబాను మామూలు ఫకీరుగా భావించి ఎన్నెన్నో నిందించాడు. సర్వాంత ర్యామి అయిన సాయినాథునికి అవన్నీ వినిపించాయి. సపత్నేకర్ ఏకైక పుత్రుడు జ్వరంతో మరణించాడు. దానితో బెంగటిల్లిన సపత్నేకర్ తనకు తానే ఆలోచించుకుని తన దోషం తెలుసుకున్నాడు. ఎంతగానో బాధపడ్డాడు. ఆ తరువాత సపత్నేకర్ తన చెంతకు వచ్చినపుడు బాబా అన్యాపదేశంగా ఆయన కథంతా పక్కవాళ్లకు చెప్పారు. అంతేగాక ఈ పాదాలు పట్టుకున్నావు కదా, ఇక నీ కష్టాలు తీరిపోతాయి, నీ మనోభీష్టాలు నెరవేరుతాయి" అన్నారు. ఆ మాటలే మంత్రమై సపత్నేకర్‌కు మళ్లీ సంతానం కలిగించాయి. అతని యిల్లు నిలబెట్టాయి.


"బాపూ సాహెబ్ బుట్టీ గొప్ప ధనవంతుడు. ఒకరోజు ఆయనకు మరణ గండం ఉన్నదని నానాడేంగలే అనే జ్యోతిష్కుడు చెప్పాడు, బూటీ ఆందోళన చెందాడు, కానీ బాబా ఆయనను పిలిచి "నీకు మరణం ఉన్నదని చెప్పినారా? అది ఎలా వస్తుందో నేను చూస్తాను అని ధైర్యంతో చెప్ప, నీకు ఏమీ భయం లేదు" అన్నారు. అలాగే ఆ రోజు సాయంత్రం బుట్టీ బయటకు వెళ్లినపుడు ఒక పాము కనిపించింది. దాన్ని కొట్టడానికి నౌకరు





కర్ర తెచ్చేంతలోపలే పాము చటుక్కున మాయమైపోయింది. అలా బాబా తన మాటలతోనే బుట్టీ మృత్యువును ఆపారు. మరోసారి బూటీకి వాంతులు, విరోచనాలు అవుతూ, ప్రమాదకర పరిస్థితులకి వెళ్లినపుడు కూడా బాబా ఒక్క మాటతోనే అతన్ని రక్షించారు. చాలా నీరసించిపోయిన బుట్టీ అతి కష్టం మీద మసీదు దగ్గరకు వచ్చాడు. బాబా అతన్ని కూర్చోబెట్టి "జాగ్రత్త! నీవు యింక విరేచనాలు చేయకూడదు, వాంతులు కూడా ఆగిపోవాలి అని చూపుడువేలు ఆడిస్తూ బెదిరించారు. అంతే-వాంతులు, విరేచనాలు ఆగిపోయాయి".

పిళ్లే ఒక డాక్టరు, అతనికి ఒకసారి నారికురుపు వ్యాధి వచ్చింది. అది పెరిగి చాలా బాధపడుతూ, "నేను ఈ బాధ భరించ లేకపోతున్నా, దీనిని నా పూర్వపు కర్మ వలన అనుభవిస్తున్నాను, ప్రస్తుతానికి ఈ బాధను తగ్గించి, ఈ కర్మను రాబోయే పదిజన్మలకు పంచమని బాబాను ప్రార్థించండి" అని మిత్రులతో మొరపెట్టుకున్నాడు. అప్పుడు బాబా పిళ్లేని తన దగ్గరకు రప్పించుకున్నారు. "మన పాపఫలాన్ని అనుభవించి కష్టవిమోచనం పొందాలి. ఎల్లవేళలా దైవనామాన్ని స్మరిస్తూ దీనిని ఓర్చుకునే ప్రయత్నం చేయాలి. ఆయన సర్వస్య శరణాగతి వేడుకో" అని కాలికి ఉన్న కట్టు ఊడదీయించారు. "ఇప్పుడే ఒక కాకి వచ్చి పొడుస్తుంది. నీ కురుపు నయమవుతుంది" అన్నారు. ఆ మాట ఇంకా పూర్తయిందో లేదో" అక్కడకు అబ్దుల్లా వచ్చాడు. ప్రతిరోజూ మసీదు శుభ్రం చేసి దీపాలు వెలిగించే బాధ్యత అతనిది. అతడు ఆ పనిని ప్రారంభించి చేస్తున్నాడు. పొరపాటున అతని కాలు పిళ్లే కురుపు మీద పడింది. వెంటనే అది పగిలి ఏడు పురుగులు బయటకు వచ్చాయి. పిళ్లే ముందు ఏడ్చినా తరువాత సంతోషంతో నవ్వాడు. అప్పుడు అందరికీ గుర్తు వచ్చింది- బాబా అబ్దుల్‌ను ఎప్పుడూ కాకి అని పిలుస్తారని. ఆ విధంగా శ్రీ సాయినాథుల వారు తమ మాటే మంత్రంగా ఎంతోమంది బాధలను, వ్యాధులను పోగొట్టారు. మహనీయుల మాటే మంత్రం. అందుచేత వారి వాక్కులను శ్రద్ధగా ఆలకించి శిరసావహించాలి.




ఓం శ్రీ సాయిరాం

జై గురుదత్త    శ్రీ గురుదత్త



# గురుపూర్ణిమోత్సవం



ప్రియ భక్తులారా,

సాయిధామం సేవాశ్రమానికి 33 సంవత్సరాలు నిండాయి. 1991లో నామకరణం చేసుకొని జీవనయానం మొదలుపెట్టిన సాయిధామం ఆశ్రమం మెల్లమెల్లగా నడుస్తూ, కొన్నిసార్లు పరుగులు తీస్తూ, ఎన్నెన్నో రీతుల సమాజంలోకి చొచ్చుకుపోతూ, వేగిపోయే ఎన్నెన్ని బ్రతుకులకో, వేడుకొనే ఎన్నెన్ని చేతులకో సేవ లందిస్తూ, బాలలకు సంస్కార విద్యను ఉచితంగా అందిస్తూ, ఉచిత వైద్యసేవలు అందిస్తూ అనేకానేక ధార్మిక రంగాలలో విస్తరిస్తూ, గ్రామీణ కళల కోసం, సామాజిక చైతన్యం కోసం కృషి చేస్తూ, వృద్ధ, బాల, దీనజన సేవకు అంకితమై ఒకనాటి చిట్టడవిని 24 భవనాలతో ఒక టౌన్‌షిప్‌లాగా తీర్చిదిద్దుతూ, ఎన్నెన్నో ఒడిదుడుకులకు ఓర్చుకొంటూ ముప్పై మూడు ఏళ్ళు నడిచింది.

ఈ ప్రయాణానికి వెనుక మీ అందరి అండదండలు స్నేహాభిమానాలు, భక్తిశ్రద్ధలు ఉన్నాయి. దీనికి చేయూతనందించిన ప్రతి వారికీ శ్రీ సాయి రక్ష లభిస్తూనే ఉంటుంది. ఇప్పుడు సాయిధామం ఆశ్రమం పరమపూజ్య గురుదేవులు తనను సృష్టించిన విధాతలు. శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభూజీ వారి దివ్యాశీస్సులతో,



శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీ రామానంద ప్రభుజీ వారి ఆధ్వర్యంలో సాయినాథుల వారు, శ్రీ దత్తాత్రేయ స్వామి సాయిధామంలోకి వేంచేసిన సందర్భంగా "గురు పూర్ణిమోత్సవాలు" అష్టావింశతి (28వ) జరుపుకోబోతున్నది. ఎప్పటి లాగే యీ ఉత్సవంలో కూడా అభిమానులు, భక్తులు మునుపటి కన్నా ఎక్కువగా పాల్గొని ధన్యులై బాబా ఆశీస్సులకు పాత్రులు కావలసిందిగా ఆహ్వానిస్తున్నాము.

## కార్యక్రమ వివరాలు

**21.07.2024 – ఆదివారం :**

| | | |
|---|---|---|
| ఉదయం | 5.00 | కాకడ హారతి |
| | 6.00 | సాయినాథుల వారికి, దత్త స్వామికి క్షీర, జలాభిషేకం |
| | 7.30 | గురుదేవులకు క్షీరాభిషేకం, అష్టోత్తర శతనామ పూజ |
| | 9.00 | బాబా వారికి అష్టోత్తర శతనామ పూజ |
| | 10.30 | వివిధ పుష్పాలతో సాయినాథుల వారికి లక్ష పుష్పార్చన ప్రారంభం |
| | 11.30 | గురుపూజ, గురుస్తుతి |
| | 11.45 | శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీ వారి ప్రవచనం |
| మధ్యాహ్నం | 12.00 | మహా నివేదన, మధ్యాహ్న హారతి |
| | 1.00 | అన్నప్రసాద వితరణ |

భక్తులందరికీ ఇదే ఆహ్వానం. పై కార్యక్రమాలకు ఏ విధంగానైనా, ధన, ధాన్య, వస్తు రూపేణ సమర్పించి స్వామి కృపకు పాత్రులు కావల్సిందిగా మనసారా ఆహ్వానం పలుకుతోంది సాయిధామం.

ఇట్లు,

**సాయిధామం.**

**చరవాణి : 9848133565, 9440413455.**

# స్వయంకల్పిత బంధం

ఒకప్పుడు ఒక ఊళ్ళో మిఠాయి వ్యాపారి ఒకడు ఉండేవాడు. అతడు దయామయుడేగాక దైవభక్తి గలవాడు కూడా. ఆ ఊళ్ళో అతడిదే పెద్ద మిఠాయి దుకాణం. సాధువులు, బైరాగులు ఎవరు అతడి కంటపడ్డా, వారిని ఆహ్వానించి సాదరంగా భోజనాదులు వారికి ఏర్పాటు చేసి, ఆనంద పడేవాడు.

అదొక మధ్యాహ్నం వేళ. ఎండ తీవ్రంగా కాస్తోంది. ఆ మండుటెండలో ఒక సన్న్యాసి కాలినడక వస్తూ ఆ మిఠాయి దుకాణం ముందు కాస్సేపు సేదతీర్చుకోవడానికి నిలబడ్డాడు. దాహం వేస్తుండటం వల్ల కాసిని మంచి నీళ్ళు ఇమ్మని ఆ వ్యాపారిని అడిగాడు. వెంటనే వ్యాపారి కొన్ని మిఠాయిలను, చల్లని పానీయాన్ని ఆ సాధువుకు ఇచ్చాడు. ఆ సాధువు తృప్తిగా ఆ మిఠాయి లను ఆరగించి, పానీయాన్ని త్రాగాడు.

ఆ తరువాత వ్యాపారి సాధువుతో, "స్వామీ! తమకేదైనా సహాయం అవసరమైతే నిస్సంకోచంగా అడగండి. నాకు చేతనైంతగా సహాయపడ గలను", అన్నాడు. అప్పడు ఆ సాధువు, "నాయనా! ఈ వస్త్రాన్ని చూడు. అనేకచోట్ల చిరిగి ఉండటంతో రాత్రుళ్ళు దోమల బాధతో నిద్రపట్టడం లేదు. నువ్వు ఆ వస్త్రాన్ని బాగుచేయించి ఇస్తే నా కదే పదివేలు" అన్నాడు. మహద్భాగ్యం అంటూ ఆ వ్యాపారి ఆ వస్త్రాన్ని తీసుకొని జాప్యం చేయక దాన్ని బాగుచేయించి ఇచ్చేశాడు. సాధువు ఆనాటి రాత్రి ప్రశాంతంగా నిద్రపోగలిగాడు.

మర్నాడు సాధువు మిఠాయి వర్తకుణ్ణి సమీపించి, ఇలా అన్నాడు : "నాయనా! నీ సహాయంతో దోమల బాధ తప్పి ప్రశాంతంగా నిద్రించ





గలిగాను. అందుకు మారుగా నీకొక సహాయం చేయగలను. నీకు ధన ధాన్యాలు ప్రసాదించే స్థితిలో నేను లేను. వాటినెప్పడో నేను త్యజించి వేయడమే అందుకు కారణం. కానీ, నా తపోబలంతో నిన్ను వైకుంఠానికి పంపగలను. యోగులు, సిద్ధులు, జ్ఞానులు మొదలైనవారు అహోరాత్రులు కఠోర సాధనలు గావించి ఏ గమ్యాన్ని చేరతారో, అలాంటి పరమగమ్య మైన వైకుంఠానికి నిన్ను నేను కొనిపోగలను. అక్కడికి కనుక వెళితే నువ్వు ఆ జనన మరణ చక్రం నుంచి విముక్తి పొందుతావు. ముక్తిని బడయగలవు".

ఆ మాటలను శ్రద్ధగా విని ఆ వ్యాపారి ఇలా అన్నాడు : "స్వామీ! తమరు నాపై చూపిస్తున్న ఈ అవ్యాజ్యప్రేమకు సర్వదా కృతజ్ఞుణ్ణి. సుదీర్ఘకాలం కఠోర సాధనలు చేసి కూడ పొందడానికి అతిదుర్లభమైన వైకుంఠ ప్రాప్తినే నాకు కలిగిస్తానంటున్నారు. కాని ఇలాంటి సదవకాశాన్ని వినియోగించు కోలేకపోతున్న నా దురదృష్టాన్ని ఏమని నిందించగలను? నాకు ఇద్దరు కుమారులున్నారు. వయస్సులో ఇద్దరూ చిన్నవారే; వారి జీవితాలకొక దారి చూపవలసిన బాధ్యత నామీద ఉన్నది కదా! అందుచేత అన్యథా భావించక మీరు ఎనిమిది సంవత్సరాల తరువాత వచ్చి నన్ను పిలిస్తే నేను తమతో వైకుంఠయాత్రకు రావడానికి సిద్ధపడి ఉంటాను. ఇలాంటి మహద్భాగ్యాన్ని ప్రసాదించిన తమకు ఎలా ధన్యవాదాలు చెప్పకోవాలో అర్థం కావడం లేదు".

తదనంతరం ఆ సాధువు సెలవు పుచ్చుకొని తన దారిన వెళ్ళిపోయాడు.

కాలచక్రంలో ఎనిమిదేళ్ళు గిర్రున తిరిగిపోయాయి. వ్యాపారి సూచించిన ఎనిమిదేళ్ళు పూర్తికావచ్చింది. ఆ సమయంలో మన సాధువు మళ్ళీ వ్యాపారి వద్దకు వచ్చి, "నాయనా! నువ్వు కోరిన ఎనిమిదేళ్ళ గడువు నిన్నటితో తీరిపోయింది. నాతో ఇప్పడు వైకుంఠానికి బయలుదేరు"

అన్నాడు. అందుకు వ్యాపారి తటపటాయిస్తూ ఇలా అన్నాడు : "స్వామీ! నా పట్ల తమకెంత దయ! మిమ్మల్ని ఎలా అభినందించాలో తోచడం లేదు. కాని నేను తమకు వాగ్దానం చేసిన మేరకు ప్రస్తుతం మీతో రాలేకపోతున్నాను. నా కుమారులిద్దరూ దురదృష్టవశాత్తు చెడుమార్గాలలో పడి త్రాగుబోతులుగాను, జూదరులుగాను అయిపోయారు. కనుక నాకు వారి ఆస్తిపాస్తులను, బాగోగులను చూసుకోవలసిన అగత్యం ఏర్పడింది. మరోలా అనుకోక తమరు మరో ఎనిమిది సంవత్సరాల తరువాత వచ్చారంటే తమతో నేను బయలుదేరడానికి తయారుగా ఉంటాను".

సాధువుకు వ్యాపారి పట్ల సానుభూతి కలిగింది. 'ఈ వ్యాపారి స్వతహాగా మంచివాడే కాని భగవంతుడి పాదారవిందాలపై భక్తిని పెంపొందించుకోవడానికి బదులుగా పుత్రప్రేమలో చిక్కుకొని మితిలేని బాధలకు గురిఅవుతున్నాడు. ఇలాంటివాణ్ణి బంధవిముక్తుణ్ణి చేయడం ఎలా?' అనే ఆలోచనలో పడిపోయాడు. తరువాత వ్యాపారితో, "నాయనా! నువ్వు చెప్పినట్లే మరో ఎనిమిదేళ్ళ అనంతరం తిరిగి వస్తాను" అంటూ వెళ్ళిపోయాడు.

సన్యాసి తాను చేసిన వాగ్దానం మేరకు మళ్ళీ ఎనిమిదేళ్ళ పిమ్మట వ్యాపారిని కలుసుకోవడానికి వచ్చాడు. కాని సన్యాసికి అప్పుడు గతంలో తాను చూసిన మిఠాయి దుకాణమో, వ్యాపారి ఇల్లో కనబడలేదు. అతడి ఇల్లు ఉండిన చోట ఒక పాడుపడ్డ ఇల్లు మాత్రం కనిపించింది. దాన్లో ఆ వ్యాపారి పెద్దకొడుకు నామమాత్రంగా ఒక చిన్న దుకాణాన్ని నడుపుతున్నాడు. అక్కడ దారిద్ర్యం తాండవించడం సాధువుకి కనిపించింది.

సాధువు దుకాణంలో ఉంటున్న పెద్ద కుమారుడి వద్దకెళ్ళి వ్యాపారిని గురించి వాకబు చేస్తూ, తనూ అతడూ చేసుకొన్న ఒప్పందం గురించి చెప్పాడు. అప్పుడు ఆ వ్యాపారి పెద్ద కుమారుడు సాధువుతో ఇలా అన్నాడు:





"స్వామీజీ! మా తండ్రి మమ్మల్ని నానా కష్టాల పాలు చేసి వెళ్ళిపోయాడు. ఏదో విధంగా నేను ఈ చిన్నదుకాణాన్ని నడుపుకొంటూ చాలీచాలని సంపాదనతో పొట్టపోసుకొంటున్నాను. నా తమ్ముడు అదిగో కనిపిస్తున్నదే, ఆ జానెడు పొలాన్ని సాగుచేసుకొంటూ కాలం వెళ్ళదీస్తున్నాడు".

అంతా ప్రశాంతంగా వింటూ ఉన్న ఆ సాధువు తన తపోబలంచేత జరిగిపోయిన విషయాలన్నిటినీ తెలుసుకోగలిగాడు. మరణించిన ఆ వ్యాపారి తన పుత్రుల మీద మమకార వ్యామోహంతో ఇంట్లోనే పొలాన్ని దున్నే ఎద్దుగా జన్మించి ఉన్నాడని సాధువు దివ్యదృష్టితో గ్రహించి, రెండవ కుమారుడి పొలం సాగుచేస్తూన్న ఎద్దు ఆ వ్యాపారే అని ఎరిగి, దాని వద్దకు వెళ్ళాడు.

రెండవ కుమారుడు మధ్యాహ్న భోజనానికై వెళ్ళినప్పుడు సాధువు ఆ ఎద్దును సమీపించి తన కమండలంలోని పవిత్రజలాన్ని దాని మీద చల్లాడు. ఆయన తపోమహిమతో ఆ ఎద్దుకు పూర్వజన్మ స్మృతి వచ్చింది. అప్పుడు ఆ సాధువు వ్యాపారి అయిన ఎద్దుతో, "నాయనా! గతంలో నీకు వాగ్దానం చేసినట్లు నిన్ను వైకుంఠానికి తీసుకుపోవడానికి వచ్చాను. నిన్నటితో నువ్వు పెట్టిన ఎనిమిదేళ్ళ గడువు తీరిపోయింది. నువ్విప్పుడు నాతో రావడానికి సిద్ధమే కదా!" అని అడిగాడు.

పూర్వజన్మ స్మృతి రాగానే ఆ వ్యాపారి దుఃఖిస్తూ ఇలా అన్నాడు : "స్వామీ! నేను కోరినట్లే ఎనిమిదేళ్ళ తరువాత మీరు రావడం సంతోషమే. కాని వెన్నాడివస్తూన్న నా దురదృష్టాన్ని ఏమని చెప్పను? నా కుమారుల దీనస్థితిని మీరే చూస్తున్నారు కదా! ఈ స్థితి ఇలాగే కొనసాగితే రెండేళ్ళ లోపునే వీళ్ళ ఆకలి బాధతో అలమటించి చావాల్సిందే! కనుక నా పట్ల దయ ఉంచి కొన్ని సంవత్సరాల పిదప వచ్చి నాకు ముక్తి ప్రసాదించండి".

ఇలా ఆ ఎద్దు (వ్యాపారి) చెప్పిన మాటలు విన్న ఆ సాధువుకు అతడిపై

అలవిగాని జాలి కలిగింది. స్వయంకల్పిత ఈ బంధాలను ఛేధించుకొని బయటపడలేక మోహాంధకారంలో బంధింపబడ్డ ఆ జీవుడికి ఎలాగైనా ముక్తి కలిగించాలన్న పట్టుదలతో ఆ సాధువు కొన్ని సంవత్సరాల తరువాత తిరిగి తప్పక వస్తానని చెప్పి వెళ్ళిపోయాడు.

కాలగమనంలో మరికొన్ని సంవత్సరాలు గడిచిపోయాయి. సాధువుకు వృద్ధాప్యం వచ్చింది. కాని తన వాగ్దానం ఎలాగైనా చెల్లించుకోవాలన్న దృఢనిశ్చయంతో యథాప్రకారం ఆయన మళ్ళీ ఆ వ్యాపారి ఇంటికి వచ్చాడు. ఆ ఇంటి ముందు ఆకలిబాధతో అలమటించిపోతున్న ఒక కుక్కను సాధువు చూశాడు. ఆ సాధువును చూడగానే ఆ కుక్క మొరగడం ప్రారంభించింది. అది విన్న వ్యాపారి పెద్ద కుమారుడు బయటికి వచ్చి సాధువును చూశాడు. సాధువు అతడితో పొలం దున్నుతూండిన ఎద్దును గురించి అడిగాడు. అందుకు వ్యాపారి పెద్ద కుమారుడు ఇలా అన్నాడు : "స్వామీజీ! ఆ ఎద్దు ఒక ఏడాది క్రితమే చనిపోయింది. ఆ ఎద్దు మాకెంత సహాయకారిగా ఉన్నదో చెప్పలేను. ఎంతో తక్కువ ఆహారం తిని, నిర్విరామంగా పనిచేస్తుండేది. అలాంటి ఎద్దు ఇకమీదట మాకు దొరకదు".

తనను చూడగానే మొరగసాగిన ఆ శునకమే మరణించిన వ్యాపారి అనీ, ఎద్దుగా జన్మించాక, తిరిగీ పుత్రుల మీద తాను కల్పించుకొన్న బంధపాశాల పర్యవసానంగా ప్రస్తుతం శునకంగా జన్మించి, తన కుమారులకు అండగా ఉంటూ, వారి ఆస్తిని ఎవరూ తస్కరించకుండా కాపలాగా ఉంటూందని సాధువు తపశ్శక్తితో తెలుసుకొన్నాడు.

తన తపశ్శక్తితో ఆ శునకానికి పూర్వజన్మ స్మృతి కలిగించగా ఆ శునకం సంజాయిషీపూర్వకంగా, "స్వామీ! నా కొడుకుల దయనీయ స్థితిని చూస్తూనే వున్నారు గదా! ఇంతటి కష్టంలో ఉండేవారిని వదిలివేసి తమతో నేను ఎలా రాగలను? కాబట్టి అన్యథా భావించక మరికొంత





కాలం గడిచాక తమరు వచ్చారంటే నేను తమతో వచ్చేస్తాను" అన్నది.

"ఆహా! ఏం విచిత్రం! మహామాయ క్రమ్మి సచ్చిదానందస్వరూపుడైన జీవుడు సంసార బంధాలలో చిక్కిశల్యమై ఎనలేని బాధలకు గురౌతున్నాడు. ఇంతకాలం గడిచాక కూడ ఇతడు భార్యాపుత్రుల బంధాలను తెంచుకోలేకపోతున్నాడే! ముక్తిని గురించి చింతించకలేకపోతున్నాడే!' అలా అనుకొన్న ఆ సాధువు హృదయం అవ్యాజ కరుణతో ద్రవించిపోయింది.

మళ్ళీ కొంతకాలం గడిచిపోయాక ఆ సాధువు, వ్యాపారి ఇంటికి వెళ్ళడం జరిగింది. ఆయన్ను చూడగానే ఆ వ్యాపారి కొడుకులిద్దరికీ చాలా కోపం వచ్చింది. 'ఈ సాధువు మనల్ని చూసివెళ్తున్న ప్రతిసారీ మనం మరింత దరిద్రులంగా మారిపోతున్నాం. బహుశ ఇతడు దురదృష్టాన్ని వెంటబెట్టుకొని వస్తున్నాడేమో!' అనుకొని ఆ సాధువును దుర్భాషలాడసాగారు.

శాంతంగా వారి దుర్భాషలన్నీ విని ఆ సాధువు ఇలా అన్నాడు : "నాయనలారా! మీకు కావలసింది ధనమే కదా! మీ తండ్రి రోజూ నిద్రించేచోట త్రవ్వి చూడండి. ఒక జాడీ నిండుగా బంగారు నాణేలు మీకు లభిస్తాయి".

వెంటనే వ్యాపారి కొడుకులిద్దరూ గునపాలు పుచ్చుకొని సాధువు సూచించిన చోట త్రవ్వసాగారు. కొంతసేపు త్రవ్వగానే ఆ గోతిలోనుంచి ఒక పాము బుసలుకొడుతూ బయటికి వచ్చింది. త్రవ్వడం ఆపి, కాస్త వెనక్కి తగ్గి ఆ ఇద్దరూ సాధువు వద్దకు కోపంగా వెళ్ళారు. అసలు సంగతి గ్రహించిన సాధువు "నేను అసత్యం పలుకుతున్నాననుకోకండి. అదిగో! ఆ జాడీ పైభాగం కొంచెంగా కనిపిస్తోంది. ఆ పామును తక్షణమే చంపి, జాడీని బయటికి తీయండి" అన్నాడు.

వ్యాపారి కొడుకులిద్దరూ నిశితంగా పరీక్షించి చూస్తే, జాడీ మూత

లాంటిది సర్పం క్రింద కనిపించింది. వెంటనే వాళ్ళు గునపాలతో ఆ పామును చంపి, జాడీని బయటికి తీశారు. సాధువు చెప్పినట్టు బంగారు నాణేలు దాని నిండా ఉన్నాయి. ఆ ఇద్దరికీ పట్టరాని ఆనందం కలిగింది.

కాని సాధువు మాత్రం వెంటనే చనిపోయిన ఆ సర్పం వద్దకెళ్ళి దాని మీద మంత్రజలం ప్రోక్షించాడు. ఎద్దుగాను, పిదప శునకంగాను పుత్రుల పట్ల తీరని వ్యామోహంతో పునర్జన్మలు ఎత్తి వారి ఇంట్లోనే జన్మించిన ఆ మిఠాయి వ్యాపారే ఇప్పుడు సర్ప జన్మనెత్తాడు. ఏ పుత్రులకై మమకారం పెంచుకొని, బంధపాశాలను అధికరించుకొని ఇన్ని నిమ్నజన్మలు ఎత్తాడో, అలాంటి పుత్రులే ఇప్పుడు నిర్దాక్షిణ్యంగా ఆ పామును (తనను) కొట్టి చంపడంచేతా, ఆ సాధువు అనుగ్రహ మహిమవల్లా కాస్తకాస్తగా అతణ్ణి ఆవరించి ఉన్న మాయామోహ బంధపాశాలు సడలసాగాయి. చివరికి ఆ సాధువుతో వైకుంఠానికి వెళ్ళడానికి పరమసంతోషంగా వ్యాపారి అంగీకరించాడు.

ఈ కథలోని మిఠాయి వర్తకుడు అవివేకంతో స్వయంగా కల్పించుకొన్న సంసారబంధాల వల్ల, మానవ జీవిత పరమావధి అయిన మోక్షాన్ని పొంద లేక జననమరణ చక్రంలో పడి అపరిమిత దుఃఖాలను అనుభవించాడు.

కాబట్టి మనం మన నిర్దిష్ట కర్మలను నిర్లిప్తతతో కర్మయోగంగా ఆచరిస్తూ తామరాకు మీది నీటి బిందువులా సంసారంలో చిక్కుకోకుండా జాగ్రత్తగా మసలుకోవాలి. ఇలాంటి మనోభావాన్ని ప్రసాదించమని భగవంతుణ్ణి ప్రార్థిద్దాం గాక!

శ్రీరామకృష్ణ పరమహంస శిష్యులలో ఒకరైన స్వామి రామకృష్ణానంద "The message of Eternal Wisdom" అనే పుస్తకంలో ఈ కథను ఉదహరించి ఉన్నారు.





# జ్ఞానోదయమే జీవన సాఫల్యము

- వల్లభనేని కుటుంబరావు

**(గత సంచిక తరువాయి)**

క్షమించటం అంత తేలిక కాదు. అది మనసు ఎంతో మంచి భావనలతో ఉండినదై ఉండి, మనసు స్వేచ్ఛగా, నిర్మలం (ఓపెన్ మైండ్)గా ఉంటేనే క్షమించగలం. లేకపోతే అంత తేలికగా క్షమించలేరు.

ఇది ఎవరికి వారు లోతుగా అధ్యయనం చేసి ఇదివరలో క్షమించక పోవటం వల్ల, తన మనస్సుకు కల్గిన వేదన, బాధ గ్రహించగలిగితే రెండవ సారి ఇది నాకు అవసరం లేదు, నేను క్షమిస్తాను అనే భావన అంతర్గతంగా కలుగుతుంది. దీనివలన గతంలో జరిగిన బాధ, అన్యాయం మనం గుర్తించం. మనం గతంలో జరిగిన దానికి బాధితుడి (విక్టిమ్)గా ఉండం. ఆ బాధ వలన నాకు విసుగు వస్తున్నది, దాని నుంచి బయట పడాలనుకొంటున్నాను. పగ, ప్రతీకారం, ద్వేషం లాంటి భావాల్నించి బయట పడాలనుకొంటున్నాను.

క్షమించటం అంటే గతాన్ని మరచిపోవటం. చూడండి ఇప్పటికి భార్యా భర్తలు ఎప్పడైనా ఒక విషయం మీద, భేదాభిప్రాయాలు వస్తే, పాతవి గుర్తు చేసి మరీ వాదిస్తారు. అంటే గతంలో చేసిన గాయం మానలేదు, క్షమించలేదు అని అర్థం.

తెలియక తప్ప పొరపాటున చేస్తే వెంటనే క్షమాపణ కోరాలి. అహం కారాన్ని తగ్గించి, క్షమాపణ కోరాలి.

కనీసం గతంలో బాధల్ని గుర్తు చేయదు. గతం గతః అనే భావన తీసుకుంటుంది.

గతంలో జరిగిన అన్యాయాన్ని, బాధనిగాని క్షమించటం వలన మన

ప్రస్తుత జీవితాన్ని ప్రశాంతంగా ఉంచుతుంది. అలాగే భవిష్యత్‌ను పాడు చేయదు. అంటే, మనలో ప్రతీకారం, కోపం ఆ వ్యక్తిపైన, విషయాలపైన శాశ్వతంగా పోతాయి.

దీనివలన బంధాలు చెడిపోవు. వ్యక్తులను పోగొట్టుకోకు. వారి ప్రేమ, ఆప్యాయత, బంధం కొనసాగుతుంది.

పైగా ద్వేషం, ప్రతీకారం, పగలోనుంచి మనం బయటకు వస్తాం. ఇది మన అవగాహనను పెంచుతుంది. అంతర్గతంగా మనం ప్రశాంతత పొందుతాం.

అదే క్షమించకపోతే, మన మనస్సులో బాధ, ద్వేషం, కోపం, పగ వల్ల వచ్చే నష్టాలు మనకు తెలుసు. వాటివలన శారీరక, మానసిక రోగాలు వస్తాయి.

మనలో అరిషట్ వర్గాలు అంటే కామ, క్రోధ, లోభ, మోహ, అహంకారం, ద్వేషం, అసూయలు పోవాలంటే మనం ఈ విధంగా సాధన చేయాలి.

1) మనల్ని చెడుగా విమర్శిస్తే మనం అతను చెప్పే దోషాలు మనలో ఉన్నాయా అని మనం పరిశీలించుకొని ఉన్నట్లైతే, అతనికి కృతజ్ఞతలు చెప్పి దోషాలు సరిచేసుకోవాలి.

2) ఒకవేళ లేనట్లయితే అతను మనలను ద్వేషంతో విమర్శిస్తే అతను మన చెడు కర్మలను తీసుకొంటున్నాడని భావించి ఆనందపడాలి. అతను అజ్ఞాని అని భావించాలి. అంతేగాని వాదనకు దిగి మనం రుజువు చేసుకోవాల్సిన పనిలేదు. ఒకవేళ అతను మన ప్రతిస్పందన కోరితే నేను చెప్పాల్సిందే ఏమీ లేదు అనాలి, అంతేగాని గొడవపడకూడదు.

3) ద్వేషం - ద్వేషాన్ని ద్వేషంతో జయించలేం. అది పతనానికి దారి తీస్తుంది. జన్మలను పెంచుతుంది. ద్వేషాన్ని ధైర్యంగా ప్రేమతో జయించాలి. జీసస్ క్రీస్తు తనను శిలువ వేసినవారు అజ్ఞానులు, పరమాత్మా! వారిని





రక్షించు అన్నాడు.

4) అలాగే కోపాన్ని తిరిగి కోపించటం పరిష్కారం కాదు. కోపాన్ని ప్రేమతో జయించటం, కోపించిన మనిషి మన చెడు కర్మలను తీసుకొంటున్నాడని సంతోషపడి నవ్వాలి. ఎదుటి వారి కోపం చల్లారుతుంది.


బుద్ధ భగవానుడు కోపించిన వాడిపై తిరిగి కోపించినవాడు మూర్ఖుడు. తిరిగి కోపించిన వాడికి ఎక్కువ చెడుకర్మ వస్తుంది అన్నాడు. కోపించిన వాడిపై కోపించని వాడికి కర్మ తగ్గుతుందన్నాడు. కోపించిన వాడిపై ప్రేమను చూపినవాడు, కోపించిన వాడిని సంస్కరించటం ద్వారా పుణ్యఫలం దక్కుతుంది అన్నాడు. తల్లిపై బిడ్డ కోపించినా తల్లి ప్రేమే చూపిస్తుంది.

5) కోపించినా, ద్వేషించినా, అసూయ పడినా, అహంకారం చూపినా వారు దేహాత్మభావంలో ఉన్న అజ్ఞానులు. నా మనస్సు వారి మనస్సు కన్నా అతీతంగా ఉన్నతస్థానంలో ఉంది. నేను ఆత్మ స్వరూపుడి భావంలో ఉన్నాను. వాడు శరీరాన్ని కోపించి, ద్వేషిస్తున్నాడు, అసూయపడుతున్నాడు. శరీరం నేను కాదు కాబట్టి తిరిగి ద్వేషించి, కోపించి అసూయపడ నవసరం లేదు అనే భావన చేయాలి. వాడు ఆత్మను ద్వేషించి, కోపించితే అదే ఆత్మ వాడిలో ఉంది, పరమాత్మలోనూ ఉంది. కాబట్టి అవి వాడికే చెందుతాయి.

నేను ఎదుటివాడి భావోద్వేగాలు, కోపం, ద్వేషం, అసూయ, అహంకారం మాటలతో ఎందుకు మమేకం అవ్వాలి అనుకోవాలి. మనం తిరిగి ప్రతిస్పందించితే, అంటే తిరిగి మాట్లాడితే మనం వాటిని గుర్తించినట్లే. నా మనస్సు అతని మనస్సు కన్నా అతీతంగా ఉన్నత స్థితిలో ఉన్నది, అతను నా చెడుకర్మను తీసుకొంటున్నాడు, మంచిదే అని మౌనంగా ఉండాలి.

6) మనం ఎవరినైనా విమర్శించేటప్పుడు ముందు ఆ తప్పులు మనలో ఉన్నాయా, లేవా అని తెలుసుకోవాలి.

**(సశేషం)**



# సాయిభక్త దాసగణు

రచన : విజయ కిషోర్

(గత సంచిక తరువాయి)

జ్యాచీ ఇచ్ఛా కర్‌షీల్ పాహ్యా । తే అవఘే ఈశ్వరమయ్ ।
ఈశే వ్యాప్త్ జగత్రయ్ । తూహీ న వెగళ త్యాపాసుని ॥
మగ్ ఇచ్ఛా కసాచీ । తూ బాపా కర్‌ణార్ సాచీ ।
జగ్ హీ మూర్తీచ్ ఈశాచీ । వెగళే త్యా మానూ నయే ॥
జే జే కాహీ జగ్‌తాత్ । తే తే తుఝేచ్ ఆహే సత్య ।
మ్హణోనియా ఏషాణాంకిత్ । హొఊ నయే సుజ్ఞాని ॥
పైసా పురున్ జమినీసీ । తో సావ్‌కార్ మానీ మజ్‌పాసీ ।
ప్రత్యక్ష్ పాహతా త్యాపాసీ । ఏక్‌హీ కవడీ దిసేనా ॥
తే అవఘే పుర్‌లేలే ధన్ । సావ్‌కార్ మానీ మాఝే మ్హణూన్ ।
త్యాచా అర్థ్ ఇతుకాచ్ జాన్ । తోహీ న వెగళా త్యాహూనీ ॥
సాగరే కా ఇచ్ఛావే క్షార్‌పణ్ । దిన్‌కరే కీ తేజ్ జాణ్ ।
వా సాఖరేనే గోడ్‌పణ్ । ఈచ్ఛావే కా సుజ్ఞ్ హొ ॥
జే జ్యాంచ్యా జవళ్ ఆధీచ్ ఆహే । త్యాచీ ఇచ్ఛా న కరితీ పాహే ।
జైసే సాగర్ సూర్య్ సాఖర్ హే । నెచ్ఛితీ క్షార్, తేజ్ గోడీ ॥
తైసేచ్ యా జగ్‌తాత్ । జే జే కాహీ ఆహే సత్య ॥
తే తే అవఘే తుజ్‌ప్రత్ । ఉపభోగితా యేయిల్ కీ ॥
ఆప్ ఆణి పర్ । హే భేద్ సురావే సాచార్ ॥
జగతూ జే దిసే ఆడంబర్ । తే అవఘూ తూంచ్ కీ ॥
హీ భావన జ్యాచే మనీ । రూఢ్ ఝాలీ అసే జాణీ ।
తోచ్ మ్హణావా మహాజ్ఞానీ । బ్రహ్మవేత్త నిశ్చయే ॥

(భావం : ఏ వస్తువునైతే చూడాలని కోరుకుంటామో, అదంతా ఈశ్వరమయం. ఈ ముల్లోకాలలో ఈశ్వరుడే వ్యాపించియున్నాడు, నీవు ఆయన నుండి వేరు కాదు. మరి ఏ వస్తువుని కోరుకుంటావు. అరే తండ్రి మరి నీవు దేనిని కోరుకుంటున్నావు. ఈ జగత్తు అనేది ఆ ఈశ్వరుని యొక్క మూర్తిమత్వం. నీవు దాని నుండి వేరుగా భావించవద్దు. ఈ జగత్తులో ఏదయితే ఉందో, నిజంగా అదంతా నీదే. అందువలన సుజ్ఞానులైన జనులు మాయకు లోబడకూడదు. ధనాన్ని భూమిలో దాచి, ఆ షావుకారు నావద్ద డబ్బులు అడుగుతాడు. ప్రత్యక్షంగా చూస్తే తన వద్ద ఒక్క నాణెం కూడా లభించదు. తాను దాచిన ధనమంతటినీ షావుకారు తన ధనంగా భావిస్తాడు. కేవలం మనసులోనే ఆ భావం యొక్క ఉపయోగం ఉంటుంది. దాని అర్థం ఇంతేనని తెలుసుకోండి. నిజంగా చూస్తే ఆ ధనం ఈశ్వరుడి నుండి వేరు కాదు. సాగర ఉప్పతనాన్ని ఎందుకు కోరుకోవాలి, సూర్యుడు వెలుగును ఎందుకు కోరుకోవాలి, చక్కెర తీయదనాన్ని ఎందుకు కోరుకోవాలి అని జ్ఞానులు విచారిస్తున్నారు. ఏదయితే మొదటి నుండే మన వద్ద ఉందో, ఆ వస్తువును మనం కోరుకోము చూడండి. ఏ విధంగానయితే సాగరం, సూర్యుడు మరియు చక్కెరలు ఉప్పదనాన్ని, వెలుగుని, తీయదనాన్ని ఇచ్ఛగించవో, అదే విధంగా ఈ జగత్తులో ఏవయితే యథార్థంగా ఉన్నాయో, వాటన్నింటినీ నీవు అనుభవించవచ్చు. కానీ, అందుకు నేను, నీవు అనే బేధం నశించాలి. ఈ జగత్తులో ఆకాశం ఆవరించిందంతా నీవే! ఈ భావం ఎవరి మనసులో అయితే ధృఢమైందో, వారినే మహాజ్ఞాని, బ్రహ్మజ్ఞాని అని నిశ్చయంగా అనాలి.)

### అమృతానుభవ లేఖనం

శ్రీ దాదా మహారాజ్ సాతార్‌కర్ అనే సుప్రసిద్ధ ప్రవచనకారులు ఆ రోజుల్లో సాతారా ప్రాంతంలో నివసించేవారు. జ్ఞానేశ్వరిపై ఆయన చేసే భక్తిరసపూరితమైన ప్రవచనాలు మహారాష్ట్రా ప్రాంతంలో ఎంతో ప్రాచుర్యమైనవి. శ్రీ జ్ఞానేశ్వర్ మహారాజ్ రచనలకు సంబంధించి, ఆ రోజులలో

అందరూ దాదా మహారాజ్‌ను ప్రామాణికంగా భావించేవారు. శ్రీ జ్ఞానేశ్వర్ మహారాజ్ రచనలపై ఆయనకున్న పట్టు గురించి ఆ రోజులలో అందరూ ఎంతో గొప్పగా చెప్పుకునేవారు. ఆయన ప్రవచనాలకు జనాలు తండోప తండాలుగా వచ్చేవారు. ఒకసారి శ్రీ దాదా మహారాజ్ పండరీపురంలో ప్రవచనం చేసేటప్పుడు, దాసగణు కూడా ఆ ప్రవచనానికి హాజరయ్యాడు. దాసగణుకు కూడా ఆయన ప్రవచనాలంటే ఎంతో ప్రీతి.

అప్పుడప్పుడే దాసగణు సంత్‌కవిగా, ఆధునిక మహీపతిగా, సంకీర్తనా కారునిగా ప్రజాబాహుళ్యంలో ప్రసిద్ధి చెందుతున్నాడు. అందువలన శ్రీ దాదా మహారాజ్, దాసగణు గురించి వినియున్నారు. ప్రవచనం ముగిసిన తరువాత దాసగణు శ్రీ దాదా మహారాజ్‌ను మర్యాదపూర్వకంగా కలవడానికి వెళ్లాడు. అప్పుడు దాదా మహారాజ్ దాసగణుతో కొంచెం వ్యంగ్యంగా

“గణపతిరావ్, ఇక కథలు (మహాత్ముల చరిత్రలు) వ్రాయడం ఆపేయ్. ఇప్పటికే చాలా వ్రాసావు. ఇకనుండయినా కొంచెం వేదాంతాన్ని నేర్చుకో” అని అన్నారు.

“అలా ఎలా అంటారు? మహాత్ముల చరిత్రలు పరమ పవిత్రమైనవి. ఆ చరిత్రలను భక్తితో వర్ణించాలి, స్మరించాలి అని పెద్దలు అంటారు కదా” అని దాసగణు కొంచెం గట్టిగానే బదులిచ్చాడు.

“అరే, వాటిలో పసిపిల్లల ముచ్చట్లు తప్ప, వేదాంత విషయాలు ఏముంటాయి?” అని ఎగతాళి మోతాదును పెంచుతూ దాదామహారాజ్ మాట్లాడారు.

“నిజమైన వేదాంతం అంతా మహాత్ముల చరిత్రలో అంతర్లీనమై ఉంటుంది. అద్భుతమైన వారి చర్యలలో ప్రకటమయ్యే వేదాంతాన్ని వర్ణించడమే కష్టం! వట్టి వేదాంతాన్ని వర్ణించడం పెద్ద కష్టమేమీ కాదు” అని దాసగణు కూడా అదే స్థాయిలో సమాధానమిచ్చాడు. **(సశేషం)**





**శ్రీ కృష్ణావతారం**

# శాశ్వత ధర్మగోప్త



- రచన : భండారు సదాశివరావుగారు

**(గత సంచిక తరువాయి)**

మా గ్రాసవాసాలకు మీరు దిగులుపడకండి. మేమే మాకు కావలసిన కందమూలాలు సమకూర్చుకుంటాం. ఇక మాకు రక్షణ గురించా? ప్రభూ!” అంటూ నవ్వి, “ఈ భీముల వారి భుజాస్ఫాలనం వినిపించినంత మేరకు, ఈ విరించి ధనుష్టంకారం ధ్వనించినంత మేరకు ఏ సింహ, శరభ, శార్దూలాలకు, ఏ రాక్షసులకు రావడానికి సాహసం ఉంటుంది? ఇన్నాళ్లుగా మీ నీడన మా పురుషార్థాలు కొనసాగాయి. శ్రోత్రియులంగా స్వేచ్ఛగా జీవించాము. ఇక మీద ధర్మద్వేషులైన కౌరవుల ఏలుబడిలో శాంతంగా ఉండగలమా ప్రభూ! మమ్మల్ని వెళ్లిపొమ్మనడం భావ్యమా?” అన్నాడు గద్గదంగా.

మరొక వృద్ధుడు గొంతు పెకిలించుకున్నాడు. “జీవన్మరణాలలో ధర్మ మూర్తులైన మీ వెంట ఉంటేనే మాకు ఇహంలోనూ, పరంలోనూ సమాధానకారకంగా ఉంటుంది” అన్నాడు.

పాండవులైదుగురూ, ద్రౌపదీ కరిగిపోయినారు. అందరూ శ్రోత్రియుల ఎదుట సాష్టాంగపడి నమస్కరించారు. శ్రోత్రియులు కనబరచిన ఆ దయకు, ఆ సద్భావానికి ఊపిరి ఆగినంత పని అయింది.

“శతం జీవ శరదో వర్ధమానః” అని శ్రోత్రియులు దీవించారు.

పాండవులకు జరిగిన భంగపాటును గురించి మహర్షి శౌనకునికి తెలిసింది. పన్నెండేండ్లు వనవాసక్లేశం అనుభవించవలసినవారు, ధర్మాత్ములే కాక, ధర్మ రక్షకులుగా నిలబడవలసిన వారు. వారికి జరిగిన అన్యాయానికి నొచ్చుకున్నాడు. యుధిష్ఠిరునికి అప్పటికే సాక్షాత్తు ధర్మరాజుగా పేరుబడింది. అలాంటి మహానుభావుణ్ణి పలకరించాలి. మాట

తప్పని మహనీయుడాయన. వనవాసాది సమయంలో ధైర్య, స్థైర్యాలతో, ఓరిమిలతోనూ కాలం గడిపే స్థిమిత చిత్తాన్ని కలుగచేయడం సముచిత మని, ఆ మహర్షికి తోచి, యుధిష్ఠిరాదులున్న చోటికి వచ్చాడు.

మహర్షికి అర్ఘ్యపాద్యాదులిచ్చి, సుఖాసీనుణ్ణి చేసిన తరువాత 'మహర్షీ! మీరు త్రికాలజ్ఞులు. ఈ వనవాసం ఎలా గడుస్తుంది? నా వరకు నాకు బెంగలేదు. కాని నా వెంటనున్న ఈ పరిజనాన్ని, మహాత్ములైన శ్రోత్రియు లను పోషించగల సత్తువ ఎక్కడినుండి లభిస్తుంది' అని వ్యాకులచిత్తుడై యుధిష్ఠిరుడడిగాడు.

శౌనకుడు యుధిష్ఠిరునికి స్వాంతనం పలుకుతూ, అతనికి జనకగీత వినిపించాడు. 'ధర్మరాజా! ఈ జీవితం క్షణికమని నీకు తెలుసు కదా! కనుక దానికై దిగులు అక్కరలేదు. మానసిక, శారీరక బాధలను తొల గించుకోడానికి కూడా విమలమైన జ్ఞానం కావాలి. మమకారం ఇబ్బందు లను పెంచుతుంది. కార్చిచ్చు వలన వృక్షాలు సమూలంగా తగలబడతాయి. అలాగే అర్థమోహం కూడా కార్చిచ్చులాంటిది. అది ప్రవేశిస్తే మనిషి భ్రష్టు డవుతాడు. అర్థమే సర్వానర్థాలకు మూలం. కనుక ఈ జనాన్ని ఎలా పోషించాలి అనే బెంగ వదలుకొని సేవిస్తూ, ఈ పన్నెండేండ్లు యోగ మార్గాన తపస్సుతో కాలం గడప'మన్నారు. నీకు కావలసిన వన్నీ సమకూరు తాయి. 'ఈ పదమూడేండ్లు నిస్సంగత్వంతో గడిపితే ప్రఖరతేజంతో తిరిగి వచ్చి రాజ్యాన్ని చేపట్టగలుగుతావు" అని ఆశీర్వదించాడు.

శౌనకుని పరామర్శతో స్థైర్యం లభించింది. కాని తన వెంటనున్న శ్రోత్రియులు, సమస్త జగత్తును కేవల భుజాస్ఫాలనంతో వశం చేసుకోగల తన సోదరులు కందమూలాల కోసం, అడవిలో పడి అలమటించడం చూస్తే, ఆయన గుండె తరుగుకొని పోయేది. ఇన్ని బాధలు తన కారణంగానే కదా!

ఆయన తమ కుల పురోహితుడు, బ్రాహ్మీమూర్తి ధౌమ్యుల వారిని





కలుసుకున్నాడు. 'మహర్షీ! వీళ్లందరికీ గ్రాసవాసోదైన్యం లేకుండా చేయ గల దారి చూపండి' అని ప్రార్థించాడు.

ధౌమ్యుడు యుధిష్ఠిరునికి సూర్యోపాసనను విధి క్రమంగా ఉపదేశిం చాడు. సూర్యుడు ప్రాణదాత-అన్నదాత, జీవనదాత, ఆయనే ఆహార కారకుడు.

యుధిష్ఠిరుడు అతికఠోరమైన దీక్షతో సూర్యుణ్ణి ఉపాసించాడు. ఆ సహస్రకిరణ దాత ప్రత్యక్షమై ఒక రాగి పాత్రను ఇచ్చాడు. అది అక్షయ పాత్ర. 'దీనితో ఎంతమందినైనా తృప్తిపరచవచ్చు. కాని రోజుకొకేసారి ఉపయోగించాలి' అని దీవించాడు.

యుధిష్ఠిరాదులు శ్రోత్రియులతోపాటు అక్కడే కొంతకాలం గడిపి, ధౌమ్యుల వారితో సహా కామ్యకవనానికి వెళ్లారు.

ధృతరాష్ట్రుడు చూపిన తిరస్కారానికి విదురుని మనసు విరిగింది. ఒక క్షణం హస్తినలో ఉండబుద్ధి కాలేదు. తన ఇంటి వారికి కుంతీదేవిని అప్పగించి, వాయువేగంతో పరుగెత్తగల గుర్రాలను పూన్చిన రథంలో కామ్య కవనంలో ఉన్న పాండవుల దగ్గరికి వెళ్లాడు.

విదురుని రథకేతనాన్ని చూచి, ఆ వస్తున్నదెవరో యుధిష్ఠిరుడు గుర్తిం చాడు. తమ్ముడు భీమసేనుణ్ణి పిలిచి, 'భీమసేనా! ఆ వస్తున్నదెవరో చూచావు కదా! మనం వచ్చేటప్పుడు ఆయుధాలను వదలి రాలేదు. అందుకే బహుశః మరోసారి ద్యూతానికి రమ్మని పిలిచేందుకు పెదనాయన గారే విదురులవారిని పంపినట్లున్నారు' అన్నాడు దిగులుగా.

'మళ్లీ ద్యూతమా' అని భీముడు ఆగ్రహంతో మండిపడ్డాడు.

'ద్యూతంగాని, మరేదిగాని, ఇహ ధృతరాష్ట్రుల వారి పిలుపును ఆదరించలేము, జూదమాడలేము. కాని విదురుల వారిని కాదనడం ఎలాగు?' అన్నాడు యుధిష్ఠిరుడు.

**(సశేషం)**

# శ్రీ సాయి నిత్య పారాయణ గ్రంథము

## భక్తి పద్య కావ్యము



రచన : “రంగరాయ” బిరుదాంకిత **శ్రీ మండువ రంగారావు**

**(గత సంచిక తరువాయి)**

ఆ.వె. వ్యాకులతను బొంది వాణిజ్య నష్టాన
శాంతి లేక దిరుగు సాఠె జూసి
శిరిడి సాయి జూడ చిత్త శాంతి గలుగు
ననుచు జెప్పె మిత్రు డతనితోడ 6

తే.గీ. పాపము నశించు వారల పనుచు చుండు
సాధు సంతుల యొద్దకు, సవ్య దిశన
పరము నొందెడు మార్గంబు పట్టి నడువ,
సాధు సంతులు పరమేశు సములు గారె 7

ఆ.వె. శిరిడిఁ జేరి సాఠె శ్రీసాయి దర్శించె
పూర్ణ బ్రహ్మతేజు పుణ్యశీలు
గనిన యంత నతని కలవరంబు దొలగి
స్థిరత నొందె మనము చింత దీరె 8

ఆ.వె. స్వప్న దర్శనంబు సాఠేకు గల్గించె
గురు చరిత పఠనము కుదురుగాను
యేడు నాళ్ల లోనె యేకచిత్తు డగుచు
పూర్తి జేసె నతని పుణ్య కతన 9





ఆ.వె. భక్త జనుల నిష్ఠ, భావంబు గనుగొని
సద్గురుండు సాయి సహకరించు
కలుగ జేయు చుండు కఠిన పరీక్షలు
కరుణ గలుగ దీర్చు కామితంబు 10

ఆ.వె. యేడు వత్సరాలు యేర్పడ జేసితి
సాయి సేవ యిచట సవ్య మతిన
నలుబదేండ్ల పఠన నాదు గురుచరిత్ర
ఫలిత మేది యనుచు వగచె హేము 11

కం. కని హేమాడ్ వేదన కరు
ణన నాతని బనిచె దక్షిణ మిష శ్యామా
గని వార్తాలాపము లా
డిన పిదపన్ రమ్మనుచు నుడివి హేమాడ్కున్ 12

తే.గీ. తిరిగి వచ్చిన హేమాడ్ కు తెలియజేసె
మూడు రోజుల నిరశన మొండి పట్టు
గాధ, రాధామయీ దేశ్ ముఖునకు తాను
గురుని గొల్చిన విధమెల్ల కూర్చి గూర్చి 13

ఆ.వె. సిద్ధ గురుడు నాదు శిరముండనము జేసి
రెండు కాసు లడిగె, యేండ్లు గడవ
కొలుచు చుంటి గురుని కోరిన దీక్షతో
మంత్ర మేది చెవిన యూదలేదు 14

కం. కచ్ఛప మీవలి యొడ్డున
అచ్ఛపు ప్రేమను గనుచును యావల పిల్లల్
జెచ్చెర బెరుగుచు నుండును
కచ్ఛపు ప్రేమాతి శయము గనుమీ గురునన్ 15

**(సశేషం)**

# ఊదీతో వంటకాలు అక్షయం

- యిమ్మిడిశెట్టి ప్రభాకరరావు, హైదరాబాదు

బాలాజీ పాటిల్ నేవాస్కర్ సాయికి అనన్య భక్తుడు. ప్రతిరోజు ఉదయాన్నే షిరిడీలో బాబా నడిచే వీధులన్నీ శుభ్రం చేసేవాడు. సాయి స్నానం చేసిన నీరు సేకరించి, అదే త్రాగేవాడు. పండిన పంటలు ద్వారకామాయి వద్దకు తెచ్చి సాయికి సమర్పించేవాడు. తిరిగి సాయి ఎంత ఇస్తే అంత తీసుకుని కుటుంబాన్ని పోషించుకొనేవాడు. అతడి తర్వాత వీధులు శుభ్రం చేసే పని అబ్దుల్, రాధాకృష్ణమాయి చేసేవారు. ఏనాడైనా వారి సేవా లోపం వస్తే, వారి కలలో కన్పించి మందలించేవాడు. అంతటి అకళంక భక్తుడు బాలాజీ పాటిల్ నేవాస్కర్.

బాలాజీ సంవత్సరీకం నాడు వాళ్ళు కుటుంబీకులు కొంతమందిని భోజనానికి పిలిచారు. భోజన సమయానికి పిలిచిన వారికంటె మూడు రెట్లు బంధువులు వచ్చారు. వండిన పదార్థాలు చాలవని, కుటుంబ గౌరవానికి భంగం కలుగుతుందని నేవాస్కర్ భార్య భయపడింది. ఆమె అత్తగారు, "భయపడకు, బాలాజీ బాబా భక్తుడు. ఈ కార్యక్రమం మనది అనుకోకు. సాయిని ప్రార్థించి, ఆయన మీదే భారం వేసి అన్ని పాత్రలు గుడ్డలతో పూర్తిగా కప్పు. వాటిలో కొంచెం ఊదీ వెయ్యి. గుడ్డ పూర్తిగా తొలగించకుండా వడ్డన చెయ్యి. సాయి మనలను తప్పక కాపాడతాడు" అని చెప్పింది. నేవాస్కర్ భార్య అలానే చేసింది. వచ్చిన వాళ్ళందరికీ భోజన పదార్థాలు సరిపోవడమే కాదు ఇంకా చాలా మిగిలాయి. తీవ్రంగా ప్రార్థిస్తే యథాప్రకారం ఫలితం వుంటుంది అని ఈ సంఘటన ఋజువు చేస్తున్నది అంటాడు హేమాడ్పంత్. ఇది సచ్చరిత్రలోని 35వ అధ్యాయంలో వివరించబడ్డ అపూర్వ లీలా విలాసం.

అది 1943వ సంవత్సరం. అప్పటికి సాయి మహా సమాధి చెంది





సరిగ్గా 25 సంవత్సరాలయింది. సబ్‌జడ్జిగా పనిచేసే బి.ఏ. భగత్ (వీరిని చాగ్లా అని కూడ అంటారు). సాయి భక్తుడు. అహమ్మద్ నగర్ జిల్లా 'కరజాటి' అనే పట్టణంలోని సాయిబాబా మందిరంలో సప్తాహం చేయించి, ఘనంగా ఉత్సవాలు నిర్వహించాడు. హరి కథా కాలక్షేపాలు, పూజలు, భజనలు, గోష్టులు మొదలైన వాటితో ఎంతో వైభవంగా కార్యక్రమాలు జరిపించాడు. ఆ రోజు పూర్ణాహుతి సందర్భంగా అన్న సమారాధన జరిపించాలని నిర్ణయించారు. సుమారు రెండు వేల మంది భక్తులు రాగలరన్న అంచనాతో వంటకాలు చేయించారు. అప్పటికి వారం రోజుల నుండి ఉత్సవ నిర్వహణలో పాలు పంచుకొన్న కార్యకర్తలు, భక్తులు చాలా అలసిపోయారు. అది బాబా కార్యం కదా అని అందరు లేని ఓపిక తెచ్చుకొని నడుం బిగించి వడ్డనకు సిద్ధమయ్యారు. కాని ఆ సమయానికి వారి అంచనాలు తారుమారు చేస్తూ ఆరు వేల మందికి పైగా అతిథులు భోజనానికి వచ్చారు. అంటే వీరు ఊహించిన దాని కంటె మూడు రెట్లు జనం అన్న మాట. వచ్చిన వారిలో ఎవరిని కాదనగలరు? చేసిన వంటకాలు వడ్డన సాగిద్దామంటే చాలీచాలని పరిస్థితి. కొందరిని ఆగమందామంటే ఎవరిని ఆపగలరు? (బాబా దగ్గర తరతమ భేదాలు లేక అందరు సమానులే కదా!) వంటకాలు చేయిద్దామంటే ఎప్పటికి తయారవుతాయి? అందుకు కావలసిన సంబారాలు అప్పటికప్పుడు ఎలా సమకూరుతాయి? అప్పటికే కాలాతీతమయింది. పెద్ద పదవి, ప్రజలలో ఎంతో గౌరవం వున్న చాగ్లా గారికి ఏమీ తోచలేదు. పరువుపోయే పరిస్థితి. ఇంతలో ఆయనకి అనిపించింది. ఇది బాబా కార్యం. అందుచేత ఆయన పైనే భారం వేద్దాం అన్న ఆలోచన కలిగింది.

సాయి నామస్మరణ చేస్తూ మందిరంలోనికి ప్రవేశించాడు. అందరినీ బయటకు పంపించివేశాడు. ఏకాంతంగా చిత్రపటంలోని బాబానే చూస్తూ ఎలుగెత్తి ఆర్తితో పిలిచాడు. అలా బాబాని ప్రార్థిస్తూ ఎలా అయినా ఈ ఆపద గట్టెక్కించమని వేడుకొంటూ తన్మయత్వంలో తనను తానే

మరచిపోయాడు. అలా ప్రార్థిస్తూనే వున్నాడు. "రోవో మత్ బేటా! బిడ్డా! దిగులుపడకు. లే!" అన్న పిలుపు చాగ్లాకు స్పష్టంగా వీనులవిందుగా వినిపించింది. చెమ్మగిల్లిన కళ్లతో తలపైకెత్తాడు. అతడి ఒడలు గగుర్పొడిచింది. ఆహా! ఏమి అతడి అదృష్టం? 25 సంవత్సరాలనాడు సమాధి చెందిన మన తండ్రి 'పిలిస్తే పలుకుతాను' అన్న అభయప్రదానం నిజం చేశాడు. ఫొటోలోంచి చెయ్యి ముందుకు చాపి, "బిడ్డా! ఇదిగో ఊది. దీనిని పాత్రలలో వుంచి మూతలు పూర్తిగా తియ్యకుండా, అందు ఎంత ఉన్నదోనని చూడకుండా వడ్డన సాగించండి" అన్నారు. బాబా కంఠధ్వని వినిపిస్తున్నది. ఫొటోలోంచి చాపిన చెయ్యి, అందులో ఊది చాగ్లాకి స్పష్టంగా కనపడుతున్నది. శరీరం పులకరించింది. బాబా! బాబా! అంటూ పిచ్చివాడిలా అరిచాడు. స్పష్టంగా కనిపించే బాబా చేతి నుండి ఊదీ అందుకొన్నాడు. సాయి ఆదేశించినట్లుగా వడ్డన సాగించేటట్లు చూశాడు. అతిథులందరూ కడుపారా తిన్నారు. చివరిలో చాగ్లా, ఇతర కార్యకర్తలు భోజనానికి పంక్తులు తీరారు. తీరా పాత్రలలోనికి చూస్తే పదార్థాలు ఇంచుమించు నిండుగానే వున్నాయి గాని తరగలేదు.

సాయి భక్తులారా! అదృష్టవంతులారా! సాయి భక్త సులభుడు. కరుణా సముద్రుడు. ప్రత్యేకించి జపతపాలు చేయడం మనికి చేతకాని పని. శాస్త్రప్రకారంగా ఉపాసనా విధులను ఆచరించి, అందులో సిద్ధి పొందడం మనకి అసలే సరిపడదు. సబ్‌జడ్జిగా విధులు నిర్వర్తిస్తూ, సామాన్య కుటుంబీకుడిగా సంసార బాధ్యతలు నిర్వహిస్తూ సాయిబాబా నిర్యాణానంతరం భక్తితో పిలిచినంత మాత్రాన ఆ తండ్రి వాక్కులు వినడం, ప్రత్యక్షంగా బాబా హస్తాన్ని చూడడం, అందుండి ఊదీ ప్రసాదాన్ని అందుకోవడం జరిగింది. మనం మన వృత్తులు మాననవసరం లేదు. అవి సక్రమంగా నిర్వర్తిస్తూ సాయిని మనసారా తలచి భక్తితో సేవించి తరించెదముగాక! జై సాయిరాం!

**- శ్రీ సద్గురు సాయినాథ చరిత్ర, రచన : వేమూరి వెంకటేశ్వర్లు**





# మాతృసంస్థ కబుర్లు

ఏప్రిల్ 17వ తేదీ సాయిధామం సేవాశ్రమంలో శ్రీరామనవమి వేడుక కన్నులపండుగగా జరిగింది. ప్రభాతవేళ శ్రీ సీతారాములకు మంగళస్నానం, అలంకరణ, పూజా కార్యక్రమం జరిగాయి.

17వ తేదీ శ్రీ సాయిదత్త పీఠం సాయిధామం సేవాశ్రమ మండల కేంద్రం బొమ్మల రామారం పరిధిలోని చీకటిమామిడి గ్రామంలో శ్రీ కోదండ రామచంద్ర స్వామి దేవస్థానం వారి ఆహ్వానం మేరకు శ్రీ సాయి దత్త పీఠాధిపతులు శ్రీ రామానంద ప్రభుజీ వారు శ్రీరామ నవమి పర్వదిన కార్యక్రమంలో పాల్గొని శ్రీ రామతత్వం, 'దేవాలయాలు-సంస్కార కేంద్రాలు' అనే విషయంపై ప్రవచనం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పరిసర గ్రామ ప్రజలు, తండాల ప్రజలు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 26వ తేదీ పెద్ద పర్వతాపురం గ్రామ వాస్తవ్యులు శ్రీ లింగం గారు తమ కుమార్తె శ్రీమతి మౌనిక కీసర మండలం కేంద్రంలో నూతనంగా ప్రారంభిస్తున్న బ్రిలియంట్ కిడ్స్ ప్లే స్కూల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీ వారు పాల్గొన్నారు.

సాయిదత్త పీఠం సాయిధామం సేవాశ్రమంలో పూజ్య గురుదేవుల ఆశీస్సులతో శ్రీ సాయీ సేవా సమితి ట్రస్ట్ నిర్వహిస్తున్న పలు సేవా కార్యక్రమాలలో భాగంగా మే 25న శ్రీ సాయీ సేవా సమితి ట్రస్టు ఆధ్వర్యంలో గ్రామ భారతి, కిసాన్‌సంగ్, నవనిర్మాణ్ ఫౌండేషన్ సహకారంతో 'సేంద్రియ వ్యవసాయం, పశుపోషణ' అనే అంశాలపై సుమారుగా 66 గ్రామాలు, 13 మండలాలు రెండు రాష్ట్రాల నుంచి ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు 120 మందికి పైగా పాల్గొన్నారు. వచ్చిన రైతులకు అధికారులకు, భక్తులందరికీ అన్నప్రసాద వితరణతోపాటు, ఆశ్రమ పుస్తకాలు, గురుదేవుల జ్ఞాపికలు అందించడం జరిగింది. ఈ కార్యక్రమం అంతా కన్నులపండుగగా జరిగింది.

# సాయిధామం సేవాశ్రమంలో సంపూర్ణ ఆరోగ్య శిక్షణ శిబిరము

ఈ శిబిరంలో ఏ వైద్యవిధానమునకు నిశ్శేషము కాని మొండి వ్యాధులు షుగర్, బి.పి, అధిక బరువు, ఆస్తమా, థైరాయిడ్, కీళ్ళనొప్పులు, మెడ, నడుమునొప్పులు, ఎలర్జీలు, చర్మవ్యాధులు, మలబద్దకము, పైల్స్, అజీర్తి, ఎసిడిటి, గుండె, లివర్, కిడ్నీ, నరాల సమస్యలు, తలనొప్పి, టెన్షన్, డిప్రెషన్, స్త్రీల సమస్యలు, ఆల్కహాల్ ఎడిక్షన్, క్యాన్సర్ ఇంకా అనేక శారీరక, మానసిక సమస్యలు, ఆహారంలో, నీరు త్రాగుటలో మార్పులు, యోగా, ప్రాణాయామము, ధ్యానము, ఉపవాస ధర్మము మొదలగు ఆరోగ్య నియమాలు శరీర ధర్మాలకనుగుణంగా అనుసరింపజేస్తూ పైన తెలిపిన జబ్బులను గ్యారంటీగా తగ్గించబడును.

పృథ్వి, జల్, వాయు, ప్రకాశ్, ఆకాష్ అను పంచ పదార్ధాలచే నిర్మించబడిన పాంచ భౌతిక శరీర పరిపూర్ణ ఆరోగ్యానికి పంచ ధర్మాలైన ఆహారము, నీరు, ప్రాణాయామము, వ్యాయామము, ధ్యానములగు ఐదు శరీర, మానసిక అవసరాలను సప్త సాధనల ద్వారా సరియైన పద్ధతిలో ప్రతిరోజూ అందించవలెను. ఇలా చేయటం వలన శరీరంలో పేరుకుపోయిన రోగకారకాలైన వ్యర్ధాలు, విష పదార్ధాలు (Toxins) విసర్జించబడి శరీరము శుభ్రము నొంది మనలో ఉన్న అత్యద్భుతమైన రోగ నిరోధక వ్యవస్థ (Immunity System) బాగా వృద్ధి చెంది శరీరము దానికదే మరమ్మత్తులు (Repair) చేసుకొని ఎటువంటి మందులు, చికిత్సలు, యంత్రాలు లేకుండా జబ్బులన్నింటిని రూపుమాపి సంపూర్ణ ఆరోగ్యమును అందించును.

**సంపూర్ణ ఆరోగ్యానికి సప్త సాధనలు**

**సాధకులు ఈ శిబిరంలో ప్రతిరోజు పొందబోవు శిక్షణలు**

1) 1 గంట ధ్యానం. ఉ॥, సా॥ 30-30 ని.లు, ప్రారంభంలో 10-10ని.లు.
2) 2 సార్లు సుఖవిరేచనము.
3) 3 సార్లు కమ్మని రుచులతో కూడిన హితకరమైన ఆహారము.
4) 4 రకాల ప్రాణాయామాలు.
5) 5 లీటర్ల మంచినీరు త్రాగు విధానము,
6) 6 గం.ల గాఢ నిద్ర. వారానికి 6 రోజులు ఆహారం, ఒక రోజు ఉపవాసం.
7) 7 వ్యాయామాలు, 7 సూర్యనమస్కారాలు, 7 ఆసనాలు, మొదలగు కనీస వ్యాయామాలు

గత 24 సంవత్సరాలుగా ఇదే ఆరోగ్య జీవన విధానమును ఆచరిస్తూ దాని యొక్క లాభాన్ని పొందుతూ అనేక యోగ సాధనా శిబిరాలలో పాల్గొని యోగ





సాధకునిగా మరియు 46 సంవత్సరాలు అల్లోపతి వైద్యునిగా విశేష అనుభవాలను సంపాదించిన డా॥ నరేశ్ కుమార్ సామల గారి శిక్షణలో ఈ ఆరోగ్య శిబిరము నడుపబడును.

మహాత్ముడు డా॥ మంతెన సత్యనారాయణ రాజుగారిచే రూపొందించిన ఆరోగ్య జీవన విధానము, ఆరోగ్యకరమైన వంటలు నేర్పుతూ రుచికరమైన ఆహారము, కమ్మని కూరగాయల రసం ఇవ్వబడును.

**మేము చెప్పిన విషయాలను గుడ్డిగా నమ్మకండి. ప్రయోగము తర్వాత ఫలితాలు వస్తేనే అనుభవపూర్వకంగా నమ్మండి.**
**అంటే ఆచరణ చేయాల్సిందే కదా!**

**గమనిక : తీవ్ర సమస్యలు ఉన్నవారు ముందుగా డా॥ నరేశ్‌కుమార్ గారిని సంప్రదించగలరు.**

**అద్భుతమైన జన్మ లభించినది. అమూల్యమైన ఆరోగ్య ధర్మమూ (విధానము) తెలిసినది. ఇకపై శ్రద్ధతో అనుసరించి సమస్త జబ్బుల నుండి విముక్తి పొందుదాం...**

యోగా మరియు ఆరోగ్య శిక్షణ ఉచితము. 15 రోజుల శిబిర కాలమునకు ఆహారము, నివాసము, ఇతర సేవలకు- జనరల్ హాల్‌లో బెడ్‌కు రూ.5000/-లు, స్పెషల్ రూం (డబుల్ బెడ్స్‌తో వాష్‌రూం) ఒక్కొక్కరికి రూ.6000/-. నిరుపేదలకు ఉచితము. సీట్లు పరిమితము.
ఫోన్ ద్వారా రిజర్వ్ చేసుకోగలరు. PhonePe / G Pay **No.** 9848133565.

శిక్షకులు సన్మానాలను స్వీకరించరు. స్వచ్ఛంద దానము చేయవచ్చును.

**తేది : 14.07.2024 ఆదివారము నుండి 28.07.2024 ఆదివారం వరకు**
**శిబిర స్థలం : ఆరోగ్య ప్రకృతి చికిత్సాలయము, సాయిధామం ఆశ్రమము.**
**శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీగారు–శ్రీ సాయిదత్త పీఠాధిపతులు,**
**డా॥ జి. చంద్రారెడ్డి** Retd.O.U.Professor-Incharge Managing Trustee,
**శ్రీ సాయి సేవా సమితి ట్రస్టు వారి నిర్వహణలో.**
**గ్రా॥ పెద్ద పర్వతాపురము, మం॥ బొమ్మలరామారం, కీసరగుట్ట దగ్గర,**
**యాదాద్రి భువనగిరి జిల్లా-508126**
**సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుండి ఇ.సి.ఐ.ఎల్. ద్వారా 30 కి.మీ.**

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు :
**డా॥ నరేశ్‌కుమార్ సామల : 8886463444, 95815 26099,**
**వి. శ్రీనివాస్ : 9133133397**

## నేటి మాట — ధనము, దానము

ఈ లోకంలో ఎన్నడూ స్థిరంగా ఉండనివి కొన్ని ఉన్నాయి. ఏనుగు చెవులు, రావి ఆకులు, సముద్రపు అలలూ.... అలాంటివే!

వాటన్నింటినీ మించి అస్థిరమైనది-ధనం! డబ్బు అంతటి నిలకడ లేనిది మరొకటి లేదు. సంపదకు ప్రతీక 'లక్ష్మి'. లక్ష్మీదేవికి 'చంచల' అని పేరు. అది ఎక్కడ దాచినా దాగదు. దొంగలపాలు కావచ్చు. అగ్నికి ఆహుతి కావచ్చు. తుదకు రాజే ప్రజోపయోగార్థం లాక్కోవచ్చు.

'న్యాయార్జిత విత్తం' కొబ్బరికాయలో నీరులా వచ్చి చేరుతుంది. అది ఆరోగ్యకరం, రుచికరం. అధర్మ సంపాదన ఓటికుండలో నీరు వంటిది. అది ఏనాటికైనా నేలపాలు కాక తప్పదు. వామనావతార ఘట్టంలో బలి చక్రవర్తి ఏం చెప్పాడు? 'కారే రాజులు రాజ్యముల్ కలుగవే! ఈ భూమి మీద వాళ్ల పేరైనా మిగిలి ఉందా కానీ మహా త్యాగమూర్తులైన శిబి చక్రవర్తి వంటి వారిని మాత్రం మరచిపోలేదు గదా' అని గురువుకే హితోపదేశం గావించాడు.

'నువ్వు తిన్నది నేలపాలు, ఇతరులకు పెట్టింది నీ పాలు!' అని లోకోక్తి. 'లక్షాధికారైన లవణమన్నమె గాని, మెరుగు బంగారంబు మింగబోడు!' అంటారు. ఒకరికి ఇవ్వకుండా, తాను అనుభవించకుండా ఉంటే అది తుదకు దొంగలపాలే! పాత్రతనెరిగి దానం చేయాలి. అపాత్రదానం అపాయకరం.

అసలు దానం పుచ్చుకోవడాన్నే తప్పపడతాయి ధర్మశాస్త్రాలు. 'అపరిగ్రహణం' అనేది ఒక ఉత్తమ వ్రతం. ఎవరినీ యాచించి ధనం తీసుకోకపోవడమే ఈ వ్రత లక్షణం. ఒకవేళ తీసుకోవలసి వస్తే, ముందుగా దాత చేతిలో ఏదైనా పెట్టి, తరువాతే పుచ్చుకోవాలంటారు. భార్యామణి బలవంతంపై కుచేలుడు శ్రీకృష్ణుణ్ణి అర్థించడానికి వెళ్లాడు. తీరా అక్కడికి వెళ్లిన తరువాత నోరు పెగలలేదు. తీసుకెళ్లిన అటుకుల్ని ఇస్తే కృష్ణుడు ఆప్యాయంగా భుజించాడు. కుచేలుడు తానుగా యాచించలేదు.





పరమాత్మ దయ ప్రసరిస్తే ఎవరికి ఏ సమయంలో ఏది లభించాలో అది లభించకుండా ఉంటుందా!

ఈ కాలంలో బతుకులు జీవనప్రధానంగా సాగుతున్నాయి. ఏదో ఒక విధంగా అధికంగా సంపాదించడమే ఎక్కువమంది బుర్రల్లో సదా సాగే ఆలోచన. ప్రజలు జీవనానికి ఇస్తున్న ప్రాధాన్యం కర్తవ్యానికి ఇవ్వడం లేదు.

మన సంప్రదాయంలో ఒక కథ ఉంది. ప్రజాపతి తన సంతానానికి మూడుసార్లు 'ద' అని బోధించాడు. దేవతలకు 'దమం', మనుషులకు దత్త (దానం), అసురులకు దయ... ఇవీ ప్రజాపతి సందేశాలు. దమం అంటే ఇంద్రియ నిగ్రహం, దేవతలకు అవసరమైనది. అసురులు క్రూరంగా ఉంటారు. అందువల్ల వాళ్లకు 'దయ'. ఇక-మనుషులు సహజంగా లోభులు. వాళ్లకు 'దత్త' అని ప్రబోధించాడు ప్రజాపతి.

దురాశతో అధికంగా కూడబెట్టడం వల్ల మానవాళి కష్టాల పాలవుతుంది. అందుకే ప్రజాపతి దత్త-'దానం చేయండి' అని ప్రబోధించాడని చెబుతారు. దానం ఐదు రకాలంటారు. ధర్మం, అర్థం, భయం, కామం, కారుణ్యం. వీటివల్ల దాతకు ఇహలోకంలో కీర్తి, పరలోకంలో ఉత్తమగతీ కలుగుతాయి.

అసూయ లేకుండా ఇస్తే అది ధర్మదానం. యాచకులు ప్రశంసిస్తూ ఉండగా ఇస్తే అర్థదానం. దానం ఇవ్వకపోతే ఏం చేస్తారో అనే భయంతో ఇచ్చేది భయదానం. ఇష్టమైన వ్యక్తికి ఇస్తే కామ దానం. పేదవాడికి జాలితో ఇచ్చేది కారుణ్య దానం. వీటిలో ఏ రకమైన దానమైనా అది పుణ్యాన్ని, కీర్తిని ప్రసాదించేదే!

దానంతో, తపస్సుతో స్వర్గానికి వెళ్లవచ్చు గదా! ఈ రెండింటిలో ఏది ఉత్తమమైనది?' అని ధర్మరాజు భీష్మణ్ణి ప్రశ్నించాడు. దానికి భీష్ముడి జవాబు 'తపస్సు ప్రభావం వల్ల పవిత్ర హృదయులైన రాజులు ఉత్తమ గతులు పొందుతారు. ధర్మపరాయణులైన రాజులు దానపుణ్యాసక్తులై నిస్సందేహంగా ఉత్తమ లోకాలకు వెళ్తారు. మార్గాలు వేరైనా ఫలితం ఒకటే! అయితే ఈ రెండో మార్గంలో వెళ్లాలంటే ధనం పుష్కలంగా ఉండాలి!'